క్లుప్తంగా

నేడు వీరబల్లికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

వీరబల్లి : రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి నేడు (గురువారం) వీరబల్లి మండలానికి రానున్నట్లు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. తాటిగుంటపల్లి గ్రామ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా గ్రామోత్సవం



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : మండలంలోని శింగనవారిపల్లెలో ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమైన రేణుకా మారెమ్మ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా శింగనవారిపల్లె, గొందివారిపల్లె, కొమ్మివారిపల్లె, చుండువారిపల్లె గ్రామాల్లో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఊరేగింపు సందర్భంగా పోతులరాజును ఎగిరించారు. అలాగే భక్తులు దారి వెంబడి తప్పెట్ల దరువుకు నృత్యం చేశారు. బాణాసంచా పేల్చారు. గ్రామోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొనడంతో ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. గ్రామోత్సవం అనంతరం సింగనవారిపల్లెలో మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టారు.

గంగమ్మకు బోనాలు



బోనాలు సమర్పిస్తున్న భక్తులు

సంబేపల్లె : మండలంలోని ఎస్‌.సోమవరం గ్రామం అగ్రహారంలో నడివీధి గంగమ్మకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. ప్రతి యేటా సంక్రాంతి తరువాత వచ్చే బుధవారం తెల్లవారుజామున బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో మహిళలు అమ్మవారికి పెద్దసంఖ్యలో బోనాలు సమర్పించారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్‌ మేనేజర్‌ వెంకటేష్‌, కళాజాత సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌ మేనేజర్‌ వెంకటేష్‌ పేర్కొన్నారు. బుధవారం జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్‌ (నాబార్డు) సౌజన్యంతో బూడిదగుంటపల్లెలో ఖాతాదారులకు బీమా పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్‌ మేనేజర్‌ చెంద్రాయుడు, వెంకటరమణ, సాయి రెడ్డి, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

కోనయ్యగారిపల్లెలో చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండల పరిధిలోని కోనయ్యగారి పల్లెలో బుధవారం ఎంపీపీ ముద్దా బాబుల్‌ రెడ్డి, సర్పంచ్‌ నాగా పిచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామంలోని హరిజనవాడ, అరుంధతివాడల్లోని పేద మహిళలకు చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌ రెడ్డి, శంకర్‌ రెడ్డి, లక్ష్మీకాంత్‌ రెడ్డి, నీలా నందకుమార్‌ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆటోలు ఓవర్‌లోడ్‌తో వెళ్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్‌ ఇస్తున్న ఎస్‌ఐ రమేష్‌

చిన్నమండెం : ఆటోల్లో ప్రయాణికులతో ఓవర్‌లోడ్‌ చేసుకుని వెళ్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. బుధవారం ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న పలు ఆటోలను ఆయన ఆపి డ్రైవర్లకు కౌన్సిలింగ్‌ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఆటోలు ఓవర్‌లోడ్‌ వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నియమ నిబంధనలు పాటిస్తూ పరిమిత లోడుతోనే ఆటో డ్రైవర్లు ప్రయాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి.. ప్రమాదాలు నివారించండి

- జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో డీఎస్పీ శ్రీధర్‌
- డ్రైవర్లకు పలు సలహాలు, సూచనలు చేసిన రవాణా అధికారులు



రాయచోటి టౌన్‌: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు



రాజంపేట: హెల్మెట్‌ ధరించిన వారికి రోజాపువ్వు ఇస్తున్న ఎంవీఐ వినోద్‌

రాయచోటి టౌన్‌ : ట్రాఫిక్‌ నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని రాయచోటి డీఎస్పీ శ్రీధర్‌ అభిప్రాయపడ్డారు. బుధవారం రాయచోటి పట్టణ పరిధిలోని ఎస్‌ఆర్‌ కల్యాణ మండపంలో వాహనాల తనిఖీ అధికారులు (ఎంవీఐ) అనిల్‌కుమార్‌, దినేష్‌ చంద్రలు ఏర్పాటు చేసిన జాతీయ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా రహదారి భద్రత – జీవితానికి రక్షణ అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్‌ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చునని చెప్పారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్‌ ఎందుకు ధరించాలనే విషయాలపై పూర్తిగా వివరించారు. తల్లి మనకు జన్మనిస్తే హెల్మెట్‌ పునర్జన్మనిస్తుందన్నారు. గత సంవత్సరం మొత్తం 727 ప్రమాదాలు జరిగితే అందులో 346 మంది చనిపోయారని చెప్పారు. వీరిలో 206 ద్విచక్రవాహనదారుల ప్రమాదాలు జరుగగా 130 మంది మరణించారని చెప్పారు. వీరందరూ హెల్మెట్‌ ధరించకపోవడం వలన ఈ ప్రమాదాలలో మరణించారని చెప్పారు. ద్విచక్రవాహనంలో వెనుక కుర్చొన్న వ్యక్తి కూడా హెల్మెట్‌ ధరించాలని సూచించారు. అనంతరం ఆటో డ్రైవర్లకూ అనేక రకాల సూచనలు, సలహాలు అందించారు. వారి నుంచి సలహాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో అడిషనల్‌ డీఎంహెచ్‌ఓ శైలజ, ఎన్‌హెచ్‌ ఏఈ హరినాథ బాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ గిరీష్‌రావు, ఆర్‌టీసీ డీఎం ధనుంజయలు ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

రాజంపేటలో...

రాజంపేట : రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు రాజంపేట మోటారు వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ బి.వినోద్‌కుమార్‌ అన్నారు. బుధవారం. 24తేదీ వరకు రోడ్డు భద్రత వారోత్సవాలను హైవేలోని ఎంవీఐ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించామన్నారు. కారులో వెళ్లేవారు సీట్‌ బెల్ట్‌ పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది, కానిస్టేబుల్స్‌ పాల్గొన్నారు. కాగా కడప–రేణిగుంట జాతీయ రహదారిలో హెల్మెట్‌ ధరించిన వారికి రోజా పువ్వు ఇచ్చి అభినందించారు.

విద్యుత్‌ చార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ

రాయచోటి అర్బన్‌ : విద్యుత్‌ చార్జీలపై పెంపుపై ఆన్‌లైన్‌ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ చిన్నస్వామినాయక్‌ ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరానికి చెందిన విద్యుత్‌ చార్జీలపై ఫిర్యాదులుంటే ఈనెల 19వతేదీ నుంచి 21వ తేదీవరకు ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ విద్యుత్‌ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి 3రోజుల పాటు ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారన్నారు. వినియోగదారులు రాయచోటి డివిజన్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌ కేంద్రం నుంచి ఆన్‌లైన్‌లో ఏపీఈఆర్‌సీకి వినియోగదారులు తమ అభిప్రాయాలను తెల్పవచ్చన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాన్ని తెలపాలని ఆయన సూచించారు.

సంక్షేమ పథకాల సారథి సీఎం జగన్‌

- చిట్వేలిలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ప్రభుత్వ విప్‌ కొరముట్ల
- అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించిన ప్రభుత్వవిప్‌ కొరముట్ల



చిట్వేలి: వృద్ధుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల తదితరులు

చిట్వేలి : రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదల ఆర్థికాభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న సారథి మన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి అని ప్రభుత్వ విప్‌, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సి కందులవారిపల్లి సచివాలయం పరిధిలోని కెకె వడ్డిపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్‌ చెవ్వు శ్రీనివాసులు రెడ్డితో కలిసి కొరముట్ల శ్రీనివాసులు ఇంటింటికి వెళ్తూ అందరినీ పలకరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఒక దివ్యాంగ బాలికకు కొత్తగా మంజూరైన రూ. 3 వేలు డిజిటల్‌ ఫించన్‌ను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ సుకుమార్‌ రెడ్డి, ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్‌ సుధాకర్‌ రాజు, రవి, సుబ్బరాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతంగా పూర్తి చేయండి



రైల్వేకోడూరు: సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : నియోజకవర్గంలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వవిప్‌ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం పలు శాఖల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తయిన భవనాలను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని, అదే విధంగా ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే పేదలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రజాప్రతినిధులు సూచించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే రూఫ్‌, కాంక్రీట్‌ లెవల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని, పనుల్లో పురోగతి చూపాలని హౌసింగ్‌ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్న నిధులు వెనుకబడిన వర్గాలకు నేరుగా చేరుతున్నాయన్నారు. దీనితో ఆయా వర్గాలలో వెలుగు నింపుతోందన్నారు. రైల్వేకోడూరును జిల్లాకే ఆదర్శంగా నిలిచేవిధంగా అభివృద్ధి చేస్తామన్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ రంగస్వామి

సంబేపల్లె : రైతుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి ఎల్లప్పుడు అధికారులు అందుబాటులో ఉండాలని ఆర్డీఓ రంగస్వామి అన్నారు. బుధవారం తహసీల్దార్‌ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్‌మెంట్‌ భూములకు సంబంధించి గ్రామాల వారీగా గుర్తించి నివేదికలను త్వరగా తయారు చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. గుట్టపల్లె సమీపంలోని పెట్రోల్‌బంకు స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ మహేశ్వరీబాయి, డీటీ లక్ష్మిప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న మెగా లోక్‌ అదాలత్‌

జయప్రదం చేయాలన్న ఏడీజే మురళీకృష్ణ



న్యాయవాదులతో సమావేశమైన ఏడీజే మురళీకృష్ణ, న్యాయమూర్తులు సరస్వతి, సంధ్యారాణి

రాజంపేట : మెగా లోక్‌ అదాలత్‌ను జయప్రదం చేయాలని జిల్లా 3వ అదనపు న్యాయమూర్తి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 11న జరగనుండటంతో బుధవారం రాజంపేట బార్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో కక్షిదారులు చేసిన పొరపాట్లను లోక్‌ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునన్నారు. గెలుపు ఓటమిలకు తావులేదన్నారు. రాజీకాదలచిన కేసుల పరిష్కారానికి చక్కటి వేదిక లోక్‌ అదాలత్‌ అన్నారు. మెగా లోక్‌ అదాలత్‌లో పెద్దసంఖ్యలో కేసులు పరిష్కారం కావాలన్నారు. సమావేశంలో సివిల్‌ జడ్జి సరస్వతి, జూనియర్‌ సివిల్‌ జడ్జి సంధ్యారాణిలు మాట్లాడుతూ ఎలాంటి కేసుల్లో రాజీపడవచ్చనేది తెలియజేశారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, సెక్రటరీ ఆనంద్‌, సీనియర్‌ న్యాయవాది రఘునాథరెడ్డి, న్యాయవాదులు జాఫర్‌, కరుణాకర్‌, వెంకటేశ్వర్లు, రమణ, షాహిద్‌, సుదర్శన్‌, కోర్టు సిబ్బంది మధు, నరసయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే ఆరోగ్య పరిరక్షణ



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

రాయచోటి అర్బన్‌ : ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని యండపల్లె పీహెచ్‌సీ వైద్యురాలు జి.దివ్యరాణి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్‌ ఫండ్‌ ఇండియా లింక్‌ వర్కర్‌ స్కీం ఆధ్వర్యంలో మండలంలోని మాధవరం కస్బాలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు దివ్యరాణి నేతృత్వంలోని వైద్యసిబ్బంది 112 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. వైద్యురాలు మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలతోనే ఎయిడ్స్‌, టీబీ లాంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చునన్నారు. అలాగే ఈ రోగాల బారిన పడినవారు ఏఆర్‌టీ మందుల ఎలా వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది మహబూబ్‌బాషా, రామాంజులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయం కార్యదర్శులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు బియ్యం ప్యాకెట్ల పంపిణీ



బియ్యం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న సయ్యద్‌ అమీర్‌

నందలూరు(రాజంపేట) : పేదల ఆకలి తీర్చినప్పుడే ఆత్మ సంతృప్తి ఉంటుందని జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌ అమీర్‌ అన్నారు. బుధవారం నాగిరెడ్డిపల్లె పంచాయతీ సర్కిల్‌లో జనాబ్‌ ఎస్టీ ఖాన్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ప్రతినిధులు ఏజీపీ షమీవుల్లాఖాన్‌, మండల కో–ఆప్షన్‌సభ్యుడు కలీం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు 25 కేజీల బియ్యం ప్యాకెట్లను అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదల మన్ననలు పొందుతున్న ఎస్టీ ఖాన్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ వారిని సయ్యద్‌ అమీర్‌ అభినందించారు. వైస్‌ ఎంపీపీ తుమ్మల భావన, సర్పంచి సూర్యనారాయణ, నడివీధి సుధాకర్‌, మన్సూర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పేద దళితులకు వ్యవసాయ భూమి ఇవ్వండి



డీటీ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె : బాలిరెడ్డిపల్లె గ్రామంలో దాదాపు వంద కుటుంబాల దళితులకు వ్యవసాయ భూములు లేవని వెంటనే వారికి భూములు ఇప్పించాలని సీపీఐ నాయకులు బుధవారం డీటీ రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలిరెడ్డిపల్లె దళితులకు ఒక్క సెంటు భూమి లేదని ఎన్నో సార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొని వచ్చామని వైకోట పంచాయతీలో దాదాపు రెండు వందల ఎకరాల్లో వ్యవసాయ భూమి ఉందని అందులో కొంతమంది భూములు చదును చేసి కాపాడుకుంటున్నారని తెలిపారు. సంబంధిత భూమిని టీడీపీ హయంలో కొందరు అక్రమంగా ఆన్‌లైన్‌ చేయించుకొన్నారని వాటిని వెంటనే తొలగించి దళితుల కుటుంబాలకు ఇప్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి చింతపూరి నాగమ్మ, రైల్వేకోడూరు నియోజవర్గ కార్యదర్శి జోతి చిన్నయ్య పాల్గొన్నారు.

రాజంపేట సబ్‌కలెక్టర్‌కు సన్మానం



సబ్‌కలెక్టర్‌ అహమ్మద్‌ఖాన్‌ సన్మానిస్తున్న గుల్జార్‌బాషా, రాజంపేట ముస్లిం నేతలు

రాజంపేట : రాజంపేట సబ్‌కలెక్టర్‌ ఫర్మాన్‌ అహమ్మద్‌ఖాన్‌ను రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ డైరక్టర్‌ గండికోట గుల్జార్‌బాషా ఆధ్వర్యంలో ముస్లిం నేతలు బుధవారం సన్మానించారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాజంపేటకు ఐఏఎస్‌ కేడర్‌ అయిన అహ్మద్‌ఖాన్‌ను సబ్‌కలెక్టర్‌గా నియమించడం ఎంతైన హర్షణీయమన్నారు. ముతవలీ షేక్‌ న్యామతుల్లా, నజీర్‌, అన్వర్‌బాషా, మహమ్మద్‌ షరీఫ్‌ ఖాన్‌, షేక్‌ ఫయాజ్‌బాషాలు పాల్గొన్నారు.

నందలూరు తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన సబ్‌కలెక్టర్‌ అహ్మద్‌ఖాన్‌ను జిల్లా వక్ఫ్‌ బోర్డు జనరల్‌ సెక్రటరీ సయ్యద్‌అమీర్‌ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. బాధ్యతలు చేపట్టిన తొలిసారిగా ఆయన నందలూరుకు విచ్చేశారు. మైనార్టీ కన్వీనర్‌ మన్సూర్‌ అలీ, బీసీ నాయకుడు తుమ్మల శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సహస్ర గళార్చన

మదనపల్లె : వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం నుంచి అన్నమయ్య కళాపీఠం నిర్వహణలో అన్నమయ్య సహస్ర గళార్చనను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంగీత కళారత్న శ్రీనివాస్‌ యాదవ్‌ నిర్వహణలో సాయంత్రం 3 నుంచి 5 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా 27వ ఎన్టీఆర్‌ వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

రామాపురం : మండలంలోని నీలకంట్రావుపేట, గువ్వలచెరువుతోపాటు పలు గ్రామాలలో బుధవారం ఎన్‌టీ రామారావు వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా మాట్లాడుతూ నటనలోనే కాక రాజకీయంగా ఉన్నత శిఖరాలు అధిరోహించిన మహోన్నతుడు ఎన్టీఆర్‌ అని అన్నారు. తెలుగువారు ఉన్నంత వరకు ఆయనను గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఎన్టీఆర్‌ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన ఎన్జీఓ నేతలు



విజయవాడకు బయలుదేరుతున్న ఎన్జీఓ నేతలు

రాయచోటి అర్బన్‌ : ఏపీ ఎన్జీఓల సంఘం రాష్ట్ర అసోసియేషన్‌కు జరుగుతున్న నామినేషన్‌ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాయచోటి, లక్కిరెడ్డిపల్లె తాలుకాల ఎన్జీఓ సంఘం నేతలు బుధవారం విజయవాడకు బయలుదేరి వెళ్ళారు. ఏపీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డిల నాయకత్వానికి మద్దతుగా వారి నామినేషన్‌ కార్యక్రమానికి ఎన్జీఓ నేతలు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బలరామరాజు, ప్రసాద్‌ యాదవ్‌ల నేతృత్వంలో విజయవాడకు ప్రత్యేక బస్సులో తరలివెళ్లారు.

మైనార్టీ పాఠశాల పనులను చేపట్టాలి

రాయచోటి : రాయచోటి పట్టణ పరిధిలో నిర్మించ తలపెట్టిన మైనార్టీ సంక్షేమ పాఠశాల పనులను చేపట్టి పూర్తి చేయించాలని కలెక్టర్‌ గిరీషా పీఎస్‌కు కాంగ్రెస్‌ నాయకులు వినతి చేశారు. అన్నమయ్య జిల్లా కాంగ్రెస్‌ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు మన్సూర్‌ అలీఖాన్‌ ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్‌ను ఈ విషయమై కలిశారు. 2019 సంవత్సరంలో రాయచోటి పట్టణంలోని మాసాపేట సమీపంలో పీఎంజీవై కింద రూ.36 కోట్లతో మంజూరైన మైనార్టీ సంక్షేమ పాఠశాల పనులను ప్రారంభించి ఇప్పటి వరకు కేవలం పిల్లర్ల వరకే పరిమితమైందన్నారు. అలాగే పట్టణంలో శిథిలావస్థలో ఉన్న షాదీమహల్‌కు మరమ్మతులు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మంచి తనానికి మించిన దైవత్వం లేదు

కురబలకోట : సృష్టిలో మానవత్వానికి, మంచితనానికి మించిన దైవత్వం లేదని మౌలానా సయ్యద్‌ మహమ్మద్‌ తల్‌హా సాహెబ్‌ ఉద్బోధించారు. బుధవారం కురబలకోట కొత్త మసీదులో ఆయన దైవ సందేశమిచ్చారు. ప్రతి మనిషి దేవుడు ఇచ్చిన ఈ జన్మకు సార్థకతను చేయాలన్నారు. అసలు మనిషి అంటేనే మంచిపనులు చేసేవాడని గుర్తుంచుకోవాలన్నారు. మతాలన్నీ కూడా మానవత్వాన్ని కలిగి ఉండాలని బోధిస్తాయన్నారు. మానవత్వం, మంచితనం, సత్యం, ధర్మం పాటించని వారికి స్వర్గం లభించదని ఖురాన్‌ కూడా తెలియజేస్తుందన్నారు. ఆధునిక కాలంలో మానవత్వం తగ్గుతోందన్నారు.

రైలు ప్రయాణికులకు విజ్ఞప్తి

- నేటి నుంచి మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్‌ రైళ్ల స్టాపింగ్‌ బంద్‌
- టికెట్‌ల విక్రయం లాభదాయకంగా లేదంటూ తెలుపుతున్న రైల్వే వర్గాలు





రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు (ఇన్‌సెట్‌) ఓబులవారిపల్లె రైల్వే స్టేషన్‌

ఓబులవారిపల్లె : కోవిడ్‌కి ముందు మండల కేంద్రంలో వెంకటాద్రి, హరిప్రియ, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు నిలిచేవి. కోవిడ్‌ అనంతరం ఎక్స్‌ప్రెస్‌ రైళ్ల స్టాపింగ్‌ను అధికారులు లేకుండా చేశారు. ఆరు నెలల క్రితం రాజంపేట పార్లమెంట్‌ సభ్యుడు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో పలు ఎక్స్‌ప్రెస్‌ రైళ్లకు స్టాపింగ్‌ కలిపించారు. స్థానికంగా స్టేషన్‌లో సంబంధిత ఆరు నెలలు పరిశీలించి రైళ్లకు టికెట్ల విక్రయం లేదనే నేపంతో నేడు గురువారం నుంచి ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను స్టాపింగ్‌ ఎత్తి వేస్తున్నట్లు రైల్వే శాఖ వర్గాలు తెలుపుతున్నాయి. పలు ట్రిప్‌ యాప్‌లలోనూ బుదవారం నుంచి రాయలసీమ, హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌ రైళ్ల స్టాపింగ్‌ చూపించడం లేదు. కోవిడ్‌కు ముందు స్థానిక రైల్వేస్టేషన్‌లో అత్యధికంగా టికెట్లు విక్రయాలు జరిగేవి దాదాపు లక్షలాది రూపాయల ఆదాయం వస్తూ ఉండేది. ప్రస్తుతం టికెట్ల విక్రయం లేని కారణంగా ఎక్స్‌ప్రెస్‌ రైళ్ల తొలగించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఓబులవారిపల్లెలో తిరుమల ఎక్స్‌ప్రెస్‌, చెన్నై ఎక్స్‌ప్రెస్‌లకు మరికొన్ని రైళ్ల స్టాపింగ్‌ కల్పించాలని రైల్వే డీఆర్‌ఎంకు ఇటీవలే నియోజవర్గ స్థాయి నాయకులు, ప్రజలు వినతిపత్రం అందజేశారు. వాటి మాట దేవుడెరుగు ఉన్న ఎక్స్‌ప్రెస్‌ రైళ్లకు స్టాపింగ్‌ ఎత్తేయడం దారుణమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పుడు మండల ప్రజలు హైదరాబాద్‌ వెళ్లాలంటే కోడూరు, రాజంపేటకు వెళ్లాల్సిందే. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలపై ఆర్థికంగా భారం పడనుంది. తిరుపతికి వెళ్లాలంటే కూడా అవస్థలు తప్పేలాలేవు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఎక్స్‌ప్రెస్‌ రైళ్ల స్టాపింగ్‌ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ మండలవాసులు కోరుతున్నారు.

స్టాపింగ్‌ ఎత్తేయడం దారుణం



మండల కేంద్రం రైల్వే పరంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని భావించాం. సంవత్సరాలు గడిచిన రైల్వే పరంగా అభివృద్ధి జరిగిందిలేదు. కోవిడ్‌కు ముందు వెంకటాద్రి, హరిప్రియ, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు ఆగేవి. ప్రస్తుతం వాటిని రద్దు చేయడం దారుణమన్నారు. దీంతో చికిత్స కోసం తిరుపతి వెళ్లేవారికి, వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్‌ వెళ్లేవారికి తిప్పలు తిప్పవు. ప్రజాప్రతినిధులు, నాయకులు మండల కేంద్రంలో రైళ్ల స్టాపింగ్‌ కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌పీ వెంకటసుబ్బారెడ్డి, రైతు, ఓబులవారిపల్లె